www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 27 ఫిబ్రవరి 2025



టిడిపి నాయకులతో.. ఎంఎల్‌సి స్లిప్పుల పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట
ఆచంట నియోజకవర్గంలో జరుగుతున్న ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి కూటమినేతలు స్వయంగా ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన చేయడమేనని ప్రజా సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. అధికారులు చేయవలసిన పనిని కూటమి నాయకులు స్వయంగా రంగంలోకి దిగినా అధికారులు పట్టించుకోకపోవడంతో విమర్శలకు తావిస్తుంది. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడానికి ఈవిధంగా చేస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. ఓటర్ స్లిప్పులు అందని ఓటర్లలో ఇప్పటికే గందరగోళం నెలకొంది. టిడిపి నేతలు స్లిప్పులు పంచడాన్ని కొడమంచిలి సర్పంచి సుంకర సీతారామ్ కూడా తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు తెలిపారు.

ఓటుకు వేళాయే..!

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి పోలింగ్ నేడే
ఓటుహక్కు వినియోగించుకోనున్న 70,052 మంది పట్టభద్రులు
జిల్లావ్యాప్తంగా 93 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
ఎన్నికల నిర్వహణకు 585 మంది సిబ్బంది నియామకం
పోలింగ్‌కు ఏర్పాట్లన్నీ పూర్తి: కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం
ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ గురువారం జరగనుంది. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటల వరకు సాగనుంది. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 93 పోలింగ్ కేంద్రాల్లో సుమారు 70,052 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణకు సుమారు 585 మంది ఉద్యోగులను నియమించారు. జిల్లావ్యాప్తంగా గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రకటించారు. జనవరి 29న ఎంఎల్‌సి ఎన్నికలకు షెడ్యూలు విడుదలైన నాటి నుంచి జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఎన్నికలపై ప్రధాన దృష్టి పెట్టింది. ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారిగా ఉన్న డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షించారు. జిల్లాలో ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేలా, ప్రశాంత వాతావరణంలో పట్టభద్రులు ఓటును వినియోగించుకునేలా ప్రతి అంశంపై క్షుణ్ణంగా పరిశీలించి ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 70,052 మంది పట్టభద్రులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. వీరిలో 39,863 మంది పురుషులు, 30,187 మంది మహిళా ఓటర్లు, ఇద్దరు ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారు. జిల్లాలోని 20 మండలాల్లో 93 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. భీమవరం డివిజన్‌లో 29, నరసాపురం డివిజన్‌లో 33, తాడేపల్లిగూడెం డివిజన్లో 31 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వెబ్‌కాస్టింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేసేలా చర్యలు తీసుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ సాగనుంది. 585 మంది సిబ్బందిని పోలింగ్ ప్రక్రియకు వినియోగించనున్నారు. 117 మంది ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 234 మంది పోలింగ్ అధికారులు, 117 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక పిఒ, ఒక ఎపిఒ, ఇద్దరు అదనపు పోలింగ్ అధికారులు, ఒక సూక్ష్మ పరిశీలకులను సైతం కేటాయించారు. భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను నుంచి సిబ్బందికి ఎన్నికల సామగ్రిని అందజేశారు. బస్సుల ద్వారా ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది తరలి వెళ్లారు. ఈ ప్రక్రియను అంతా సహాయ రిటర్నింగ్ అధికారి, డిఆర్ఒ వెంకటేశ్వర్లు, ఆయా ఆర్‌డిఒలు పర్యవేక్షించారు. నరసాపురం, భీమవరం డివిజన్‌లో ఆరు రూట్లు చొప్పున, తాడేపల్లిగూడెం డివిజన్‌లో ఐదు రూట్లు ఏర్పాటు చేశారు. ఒక్కో రూట్ పర్యవేక్షణకు ఒక రూట్ ఆఫీసర్, ఒక సెక్టార్ ఆఫీసర్‌ను నియమించారు. ఓటర్లు ప్రభుత్వం నిర్దేశించిన 11 గుర్తింపు కార్డుల్లో ఏదోక గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకెళ్ళాల్సి ఉంటుంది.


తాడేపల్లిగూడెంలో..



పోలింగ్ సామగ్రితో బయలుదేరిన ఎన్నికల సిబ్బంది

సమిష్టిగా పోలింగ్ పూర్తి చేయాలి
చదలవాడ నాగరాణి, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్



పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాం. పోలింగ్ ప్రక్రియకు సరిపడా సిబ్బందిని నియమించాం. సీసీ కెమెరాల నిఘాలో ప్రక్రియ జరుగుతుంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నాం. జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సిబ్బంది, పోలీస్ సిబ్బంది సమిష్టిగా కృషి చేసి విజయవంతం చేయాలి.

నరసాపురం: డివిజన్ పరిధిలో 33 పోలింగ్ కేంద్రాల్లో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలు జరుగుతున్నట్లు నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు అన్నారు. బుధవారం నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ దాసి రాజు మాట్లాడుతూ మొత్తం ఎనిమిది మండలాల్లో 26,812 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 15,318 పురుష ఓటర్లు, 11,494 మహిళా ఓటర్లు ఉన్నారన్నారు. పోలింగ్ అనంతరం పోలింగ్ సామగ్రిని భీమవరం కలెక్టరేట్‌కు పోలీస్ బందోబస్తు మధ్య తరలిస్తామన్నారు. నరసాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.


సామగ్రి పంపిణీని పర్యవేక్షిస్తున్న ఆర్‌డిఒ దాసిరాజు

తాడేపల్లిగూడెం: గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఆర్‌డిఒ కతీ కౌసర్ బానో తెలిపారు. తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలోని 31 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని బుధవారం ఉదయం ఆయా పోలింగ్ కేంద్రాలకు పంపిణీ చేసినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ అనురాధ, తాడేపల్లిగూడెం పట్టణ సిఐ ఎ.సుబ్రహ్మణ్యం, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటేసేందుకు వెళ్తున్నారా..!

-పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లు వినియోగిస్తారు.
-పోలింగ్ కేంద్రానికి తగిన గుర్తింపు పత్రంతో వెళ్లి అధికారులకు చూపించి ఓటరు గుర్తింపు ఉన్న పత్రంపై ఓటరు పేరు వద్ద సంతకం చేస్తే అనంతరం బ్యాలెట్ పేపరు అందిస్తారు.
-బ్యాలెట్ పేపర్లో అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఉంటాయి.
-బ్యాలెట్ పేపరో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రంలో ఎన్నికల అధికారులు ఇచ్చిన పెన్ మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుంది.
-ప్రాధాన్యతాక్రమంలో వారికి నచ్చిన అభ్యర్థి పేరు ఎదురుగా గల గడిలో 1 అని అంకెను వేయాల్సి ఉంటుంది.
-ఆ తర్వాత ఇష్టమైన వారికి ప్రాధాన్యతను అనుసరించి 2, 3, 4 అంకెలు వేయవచ్చు.
-ఒకే అంకెను (నెంబరు) ఇద్దరికి వేయకూడదు. అలా వేస్తే ఆ ఓటు చెల్లదు.
-అలాగే ఓటు వేసేటప్పుడు 1 అంకె వేయకుండా 2, 3, 4 వేస్తే ఓటు చెల్లదు
- అంకెలు కాకుండా రోమన్ సంఖ్యలు వేసినా ఓటు చెల్లదు. అక్షరాలు రాసినా చెల్లుబాటు కాదు.
-ఎన్నికల సంఘం సూచించిన ఏదోక గుర్తింపు కార్డును తప్పక తీసుకెళ్లాలి.

ఓటేసేందుకు తీసుకెళ్లాల్సిన గుర్తింపు కార్డులు
1.ఆధార్, 2.పాన్‌కార్డు, 3.విశ్వవిద్యాలయ సర్టిఫికెట్, 4.ఓటరు గుర్తింపు కార్డు, 5.పాస్‌పోర్ట్, 6.డ్రైవింగ్ లైసెన్స్ 7.డిపార్ట్‌మెంట్ ఫొటో గుర్తింపు కార్డు, 8.జాతీయ ఉపాధి హామీ జాబ్‌కార్డు, 9.బ్యాంకులు, తపాలా శాఖ జారీ చేసిన ఫొటోతో ఉన్న పాస్‌బుక్, 10.పెన్షన్ డాక్యుమెంట్ తదితరాలైన ఫోటో గుర్తింపు కార్డుల్లో ఏదోకటి తీసుకెళ్లాలి.

బడాబాబుల ఆక్రమణలు కన్పించవా..!

నోటీసులు ఇవ్వకుండా కూల్చివేత తగునా
ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు తీరుపై సిపిఎం విమర్శ

ప్రజాశక్తి - ఉండి
పేదలు, చిరు వ్యాపారులపై ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు ప్రతాపం చూపించడం దుర్మార్గమని సిపిఎం నాయకులు ధనికొండ శ్రీనివాస్ విమర్శించారు. ఉండి మెయిన్ సెంటర్లో అధికారులు కూల్చివేసిన సిపిఎం కార్యాలయాన్ని ఆ పార్టీ మండల కార్యదర్శి చీర్ల శేషుతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ధనికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ అభివృద్ధి ముసుగులో పేద ప్రజలపై, చిరు వ్యాపారులపై స్థానిక ఎంఎల్ఎ ప్రతాపం చూపుతూ ఆక్రమణల తొలగింపు పేరిట వారికి నిలువ నీడ లేకుండా చేస్తున్నారన్నారు. నిస్వార్థంగా రఘురామకృష్ణంరాజు పని చేస్తుంటే బడాబాబుల ఆక్రమణలో ఉన్న బందరు పుంతను స్వాధీనం చేసుకుని ప్రభుత్వపరం చేయాలని సవాల్ విసిరారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే వారికి ముందస్తుగా నోటీసులిచ్చి గడువు ఇవ్వాలని, ఆ గడువులోగా ఖాళీ చేయకపోతే అప్పుడు అధికారులు చర్యలు చేపట్టవచ్చుని అన్నారు. అయితే తమకు ఎటువంటి నోటీసులుగాని, గడువుగాని ఇవ్వకుండా జెసిబిని తీసుకొచ్చి తమ కార్యాలయాన్ని కూల్చడం వారి నియంతృత్వానికి నిదర్శనమని ఆరోపించారు. ఎంఎల్ఎ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా సిపిఎం పోరాడుతుందనే నాయకులను ఏమీ చేయలేక అభివృద్ధి పేరిట సిపిఎం కార్యాలయాన్ని కూలగొట్టాలని అధికారులను ఆదేశించడం వారి విజ్ఞతకు వదిలేస్తున్నామన్నారు. ఐ.భీమవరంలో గొట్టుముక్కల సత్యనారాయణరాజు అనే వ్యక్తికి చెందిన భవంతిని తొలగించాలని అధికారులు మార్కింగ్ చేయగా దానిని ఇప్పటికీ తొలగించకుండా ఉండటం చూస్తుంటే అధికారులు కేవలం నిరుపేదలపైనే ప్రతాపం చూపిస్తూ బడాబాబులకు ఊడిగం చేస్తున్నట్లు తేటతెల్లమవుతుందన్నారు. ఆక్రమణల పేరిట వేలాది మందిని నడిరోడ్డు మీద పడేసిన ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు వెంటనే వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఆక్రమణలు తొలగించిన చోట అభివృద్ధి ఏదైనా చేశారా అని ప్రశ్నించారు. ఇదంతా కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిలో పడి మంత్రి పదవి తీసుకోవడం కోసమే చేస్తున్నట్లుగా అనిపిస్తుందన్నారు. ఎంఎల్ఎ తీరుకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే ఉద్యమానికి నిరుపేదలు, చిరు వ్యాపారులు, కార్మికులు సహకరించాలని సీనియర్ నాయకులు మునుకోలు వైకుంఠరావు అన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా నిలిచిన ఎవరికీ అధికారం శాశ్వతం కాదని ప్రజలు నిరూపించే రోజు దగ్గర్లోనే ఉందని సిపిఎం మండల కార్యదర్శి చీర్ల శేషు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకూరి వెంకటరత్నం, కొట్టాడ వెంకటేశ్వరరావు, చీర్ల శ్రీనివాస్, కురిటి సోమేశ్వరరావు, మోపిదేవి రాము, కడలి నాగేశ్వరరావు, సావు వెంకన్న, ఏలూరు వెంకన్న బాబు పాల్గొన్నారు.


సిపిఎం కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నేతలు

ఎంఎల్‌సి ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - తణుకు రూరల్
ఉమ్మడి తూర్పు, పశ్చిమ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో భాగంగా తణుకు పట్టణ, రూరల్ మండలం పరిధిలో 8,536 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అందుకోసం మొత్తం 12 కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తణుకు మండల తహశీల్దార్ అశోక్ వర్మ తెలిపారు. ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లు ప్రభుత్వం అందజేసిన ఓటరు స్లిప్‌తో పాటు ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి ప్రభుత్వం అందించిన ఏదైనా గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. బ్యాలెట్ విధానంలో జరిగే ఈ ఎన్నికల్లో అభ్యర్థులకు ప్రాధాన్యతా నంబర్లు వేయాల్సి ఉంటుందన్నారు. ఒక్కో అభ్యర్థికి ఒక్కొక నెంబర్ చొప్పున 1, 2, 3, 4 అని అభ్యర్థి ఎదురుగా బాక్స్‌లో ప్రాధాన్యత సంఖ్య రాయాల్సి ఉంటుంది. మరేఇతర రాసినా ఓట్లు చెల్లవని అధికారులు చెబుతున్నారు.

వీరవాసరం : వీరవాసరం కేంద్రంగా జరగనున్న పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ఏర్పాట్లు పూర్తయినట్టు తహశీల్దార్ ఎవి.రామాంజనేయులు తెలిపారు. వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పోలింగ్ బూత్‌లను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ పోలింగ్ కేంద్రం వద్ద మూడు బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 2,241 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఇందులో పురుషులు 1,298, మహిళలు 943 మంది ఉన్నట్టు తెలిపారు. ఈయన వెంట ఆర్ఐ రూజ్‌వెల్డ్, విఆర్ఒ సవరం సత్యనారాయణలు ఉన్నారు.


ఆకివీడులో ఎన్నికల సామగ్రిని తరలిస్తున్న సిబ్బంది

ఆకివీడు : శాసనమండలి ఎన్నికలకు మండలంలో సర్వం సిద్ధమయ్యాయి. మండలంలో మూడు ఎన్నికల బూత్‌లు స్థానిక సరోజినీ నాయుడు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈమేరకు సిబ్బంది ఎన్నికల సామాగ్రితో బుధవారం సాయంత్రం బూత్‌ల వద్దకు చేరుకున్నారు. ఆమేరకు బూత్‌లను సిద్ధం చేసుకున్నారు. 384, 385, 386 నెంబర్లు గల ఈ బూత్‌లలో 2,046 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.


ఉండి : ఉమ్మడి గోదావరి జిల్లా పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తిచేసినట్లు మండల తహశీల్దార్ కావడి నాగార్జున తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎన్నికల సందర్భంగా రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామని, వాటిలో 1,532 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఇప్పటికే పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారన్నారు. ఓటర్లకు కావలసిన మౌలిక వసతులన్నీ ఏర్పాటు చేసామన్నారు.

పెనుమంట్ర : గురువారం జరుగనున్న ఉభయ గోదావరి జిల్లాల ఎంఎల్‌సి ఎన్నికలు నిమిత్తం మండలంలోని మూడు బూత్‌లలో అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయాని, మొత్తం 2,132 ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారని సంబంధిత అధికారులు బుధవారం సాయంత్రం ఇక్కడ తెలిపారు. ఇక్కడ బ్రాహ్మణచెర్వులోని ఎంపిపి స్కూల్‌లో రెండు బూత్‌లు, పెనుమంట్ర ఆర్ఎ జెడ్‌పి హైస్కూల్‌లో ఒక బూత్ ఏర్పాటు చేసినట్టు వారు వెల్లడించారు. మొత్తం మూడు బూత్‌లలో బ్రాహ్మణ చెర్వు 408 నంబర్ బూత్‌లో 710 మంది ఓటర్లు, 409 నంబర్ బూత్‌లో 713 ఓటర్లు, పెనుమంట్ర బూత్ నెంబర్ 410లో 709 ఓటర్లు ఉన్నారు. పిఒలుగా విద్యాశాఖకు చెందిన అధికారులు ఉంగరాల నాగేశ్వరరావు, జి.వరలక్ష్మి, బి.సత్యనారాయణలను నియమించినట్టు వారు తెలిపారు.

ఆచంట : ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రులు ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ స్టేషన్‌లను నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ దాసిరాజు మాట్లాడుతూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సమస్యలతో తలెత్తకుండా చూడాలని సూచించారు.

వరిపంటకు సాగు నీరందించరూ..

ప్రజాశక్తి - పోడూరు
ప్రస్తుతం పొట్టదశలో ఉన్న వరిపంటకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. సాగునీటి ఎద్దడి సమస్యపై మండలంలో బుధవారం పర్యటించారు. గుమ్ములూరు గ్రామ పరిధిలోని రాయప్పనగర్, నాగులగుంట, దక్షిణపాలెం, రావిగొప్పు, వద్దిపర్రు ప్రాంతాల్లో సాగునీరందక పంట పొలాలు ఎండిపోయాయన్నారు. కనీసం పంటకు ఎరువులు వేసే పరిస్థితి లేదన్నారు. పలువురు కౌలురైతులు మాట్లాడుతూ దాళ్వాకు వెంట వెంటనే ఎరువులు వేయాలని, పొట్టదశలో నీరు లేకపోతే ఎదుగుదల, దిగుబడిపై ప్రభావం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే సాగునీరు విడుదల చేయాలని, ఇంజిన్లు వేయకుండా అధికారులు చర్యలు తీసుకుని శివారు భూములకు నీరందేలా చూడాలని కోరుతూ ఇరిగేషన్ డిఇ వెంకటనారాయణ దృష్టికి తీసుకెళ్లామని రామాంజనేయులు తెలిపారు. అధికారులు గరువారం నుండి వంతు విడుదల చేస్తామని, పూర్తిస్థాయిలో సాగునీరు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కౌలురైతులు జి.పిలిప్, జి.పండు, కె.జోషి, ఎస్.నాగేశ్వరరావు, ఎం.త్రిమూర్తులు, జి.కరుణ పాల్గొన్నారు.


గుమ్ములూరులో సాగునీరందక ఎండుతున్న పొలాలు

రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - వీరవాసరం
ఒక మారుమూల గ్రామీణ ప్రాంతంలో రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు నిర్వహించడం అభినందనీయమని రాయకుదురు సర్పంచి గెడ్డం భారతీ భాస్కరావు అన్నారు. రాయకుదురు పంచాయితీ పరిధి జగన్నాధపురం గ్రామంలో రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలను బుధవారం సర్పంచి ప్రారంభించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, ఎంపిటిసి కడలి నెహ్రూ, గ్రామస్తులు పాల్గొన్నారు.


చెడుగుడు పోటీలు ప్రారంభిస్తున్న సర్పంచి గెడ్డం భారతి

శివరాత్రి వేళ విషాదం

తమ్మిలేరులో స్నానానికి దిగి ఇద్దరు సోదరులు మృతి
శోకసంద్రమైన తిమ్మక్కపాలెం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్
ఇద్దరు సోదరులు తల్లిదండ్రులతో కలిసి మహాశివరాత్రి సందర్భంగా బలివే ఆలయానికి వెళ్లారు. సోదరులిద్దరూ తాము స్నానం చేసి వస్తామని తల్లిదండ్రులకు చెప్పి వెళ్లారు. వారు అక్కడకు సమీపంలోని పెదవేగి మండలం నడిపల్లి వద్ద తమ్మిలేరులో స్నానానికి దిగి గల్లంతయ్యారు. ఈ విషయం తెలిసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. దీనికి సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. లింగపాలెం మండలం తిమ్మక్కపాలెం గ్రామానికి చెందిన మురళీ, మంగమ్మ దంపతులకు మునియా(24) మారేషు (22) ఇద్దరు కుమారులు ఉన్నారు. మునియకు, మారేషుకు ఇంకా వివాహం కాలేదు. బుధవారం మహాశివరాత్రిని పురస్కరించుకుని కుటుంబసమేతంగా ముసునూరు మండలం బలివే వెళ్లారు. మురళీ, మంగమ్మ ఆలయం వద్ద ఉండగా తాము స్నానం చేసి వస్తామని సోదరులిద్దరూ తల్లిదండ్రులకు చెప్పి అక్కడకు సమీపంలోని పెదవేగి మండలం నడిపల్లి గ్రామ శివారులోని మునిపల్లి వద్ద తమ్మిలేరులోకి దిగారు. స్నానం చేస్తుండగా ఇద్దరు సోదరులు ప్రమాదవశాత్తూ గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరి వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కొంతసేపటికి ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఇద్దరు కుమారులు విగత జీవులుగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు యువకుల మృతితో తిమ్మక్కపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై పెదవేగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

బాబాయ్‌ను కాపాడేందుకు వెళ్లి..!

చెరువులో స్నానానికి దిగి ఊబిలో ఇరుక్కున్న బాబాయ్
కాపాడేందుకు దిగిన కుమారుడు కూడా గల్లంతు
గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్
సరదాగా చెరువులో స్నానానికి దిగి ఊబిలో దిగబడిన తన బాబాయ్‌ను కాపాడేందుకు వెళ్లిన అబ్బాయి కూడా బాబాయ్‌తో పాటు గల్లంతయ్యాడు. ఈ ఘటన ఏలూరు నగరంలోని వట్లూరులో చోటు చేసుకుంది. సంబంధిత వివరాల ప్రకారం.. ఏలూరు నగరంలోని మూడో పట్టణ పరిధి వట్లూరు గ్రామానికి చెందిన బజ్జవరపు వెంకటేశ్వరరావు (55) భార్య పిల్లలతో కలిసి జీవనాన్ని సాగిస్తున్నాడు. ఇతను కుల వృత్తి అయిన చాకలి పని చేస్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం వెంకటేశ్వరరావు స్నానం చేసేందుకు చెరువులో దిగాడు. ఇదే సమయంలో అతని అన్నయ్య కోటేశ్వరరావు కుమారుడు బజ్జవరపు సుబ్రహ్మణ్యం (30) చెరువు గట్టుపై ఉన్నాడు. స్నానానికి దిగిన వెంకటేశ్వరరావు హఠాత్తుగా చెరువులో ఉన్న ఊబిలో ఇరుక్కుపోయాడు. ఇది గమనించిన సుబ్రమణ్యం తన బాబాయ్‌ను కాపాడేందుకు చెరువులోకి దిగాడు. అతడిని కాపాడుతున్న సమయంలో వెంకటేశ్వరరావుతో పాటు సుబ్రహ్మణ్యం కూడా ఊబిలో ఇరుక్కుపోయాడు. ఇద్దరు చెరువులో గల్లంతయ్యారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గల్లంతైన వారికోసం వెతుకులాట ప్రారంభించారు. ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో మూడో పట్టణ ఎస్ఐ రాంబాబు గాలింపు చర్యలు చేపట్టారు.

హమాలీల కూలి రేట్లపై జిఓ విడుదల చేయాలి

4, 7 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు
హమాలీల యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.ఉమామహేశ్వరరావు

పెంటపాడు : సివిల్ సప్లయీస్ హమాలీలకు పెరిగిన కూలీరేట్లు, 14 నెలల ఏరియర్స్ చెల్లింపుకు వెంటనే జిఒలు చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 4వ తేదీన మండల కార్యలయాలు, 7వ తేదీన విజయవాడ ఎండి కార్యాలయం వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు హమాలీల యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. పత్తిపాడు సివిల్ సప్లయీస్ గోడౌమ్స్ వద్ద గత నవంబర్ 20వ తేదీన కూలీరేట్లు క్వింటాల్‌కి రూ.25 నుంచి 28కు పెంచేందుకు ప్రభుత్వానికి హమాలీ కార్మిక సంఘాల మధ్య ఒప్పందం జరిగింది. కానీ నేటికీ జిఓ జారీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడాన్ని నిరసిస్తూ సివిల్ సప్లయీస్ హమాలీ కార్మికులు బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కె.ఉమామహేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరుపు రంగారావు మాట్లాడుతూ సివిల్ సప్లయీస్ కూలీరేట్లు జిఓ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరిగిన కూలీరేట్లు 2024 జనవరి నుంచి 14 నెలల ఏరియర్స్ చెల్లింపుకు అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని వారు కోరారు. ఇఎస్ఐ అమలుకు ఆటంకంగా వున్న కోర్టు కేసులను ప్రభుత్వం ఉపసంహరించాలని వారు ప్రభుత్వానికి సూచించారు. కూలీరేట్లు 25 నుంచి 28కి పెంచిన జిఓతో పాటు ఏరియర్స్ చెల్లింపుకు వెంటనే చర్యలు తీసుకోవాలని, దసరా బోనస్, స్వీట్, యూనిఫాం, టిచ్చింగ్ ఛార్జీ, స్వీపర్ వేతనాల పెంపుకు సంబంధించిన సమస్యల్ని హమాలీ సంఘాల నాయకులతో తక్షణమే చర్చలు జరపాలని వారు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మార్చి 4వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా మండల కార్యాలయాల వద్ద ధర్నాలు, మార్చి 7న విజయవాడ ఎండి ఆఫీసు వద్ద జరిగే ధర్నాలలో పెద్ద ఎత్తున హమాలీలు పాల్గొని జయప్రదం చేయాలని వారు హమాలీలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే మార్చి 20 నుంచి సమ్మెకు దిగుతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మజ్జి సింహాచలం, నిమ్మల వెంకట సుబ్రహ్మణ్యం, కవల గంగరాజు, కొప్పు సత్యనారాయణ, మద్దాల రంగారావు, జడ్జ్ వరలయ్య, సివిల్ సప్లయీస్ కార్మికులు పాల్గొన్నారు.


ప్రొక్లెయిన్‌తో కాల్వలో గుర్రపుడెక్క తొలగిస్తున్న సిబ్బంది

కొమరాడ కాల్వలో గుర్రపు డెక్క తొలగింపు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మండలంలోని కొమరాడ గ్రామంలో ఉన్న కాలువలో గుర్రపుడెక్క, తూడు తొలగిస్తున్నామని కొమరాడ కాలవ నీటి సంఘం అధ్యక్షులు గంజాల నాయుడు స్వామి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా పంట కాలవలోని చెత్తను తొలగించి, పరిశుభ్రంగా ఉంచుతున్నామన్నారు. దిగువస్థాయి గ్రామాలో ప్రజలకు తాగునీటితోపాటు, రైతులకు సాగునీటి ఇబ్బందులు కూడా తలెత్తకుండా చేపడతామని చెప్పారు. వేసవిలో దాళ్వా పంటకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తామని, రైతులు ధైర్యంగా ఉండాలని కోరారు. రైతులకు అండగా నిలుస్తామని తెలిపారు.

పేదలకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

జాతీయ కాపు సేవాసమితిని రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు విస్తరిస్తున్నట్లు జాతీయ మీడియా లీగల్ కన్వీనర్ కాలవ మహేష్ బాబు చెప్పారు. పాలకొల్లు త్యాగరాజ కళ్యాణ మండపంలో మంగళవారం జరిగిన సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు సేవా కార్యక్రమాల్లో భాగంగా బెత్తెహం పేటకు చెందిన పలువురు పేదలకు కిట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. త్వరలో అన్ని నియోజకవర్గాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాలకొల్లు నియోజకవర్గం కన్వీనర్‌గా పినిశెట్టి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులుగా కొమ్ముల గణేష్, యలమంచిలి మండల అధ్యక్షులుగా కాసా గణపతి, ప్రధాన కార్యదర్శిగా ఇనుకొండ రమేష్, చించినాడ అధ్యక్షులుగా తోట వెంకటేశ్వరరావు, పోడూరు మండల అధ్యక్షులుగా ఎంపిటిసి సభ్యులు, మానేపల్లి శ్రీధర్ నియమితులైనట్లు చెప్పారు. జాతీయ మహిళా కన్వీనర్‌గా వన్నెంరెడ్డి భవాని, జాతీయ అధ్యక్షులు కాల్వ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వరుస చోరీల్లో నిందితుని అరెస్ట్

రూ.5.20 లక్షల విలువైన 69.5 గ్రాముల బంగారం, 1,144 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం

ప్రజాశక్తి - తణుకు

తణుకు టౌన్, తణుకు రూరల్ స్టేషన్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడిన ముద్దాయిని తణుకు టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.5.20 లక్షల విలువైన 69.5 గ్రాముల బంగారు వస్తువులు, 1,144 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. చోరీ సంబంధించిన వివరాలను తణుకు టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.కొండయ్య వెల్లడించారు. పెనుగొండ మండలం పెనుగొండకు చెందిన తానేటి ఆశీర్వాదం జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పూర్తిగా చేసుకున్నాడని వివరించారు. ఈక్రమంలోనే తణుకు రూరల్ స్టేషన్ పరిధిలో ముందుగా తాళాలు వేసి ఉన్న ఇళ్లను రెక్కీ చేసి, తాళం కప్పలను గునపాలతో, ఇనుప రాడ్లతో బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించి, విలువైన వస్తువులను దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. తణుకు పట్టణం పాతవూరులోని పశువుల ఆసుపత్రి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఆశీర్వాదంను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి సుమారు రూ.69.5 గ్రాముల బంగారం, 1,144 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తణుకు టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో 1 కేసు, తణుకు రూరల్ స్టేషన్ పరిధిలో 3 కేసుల్లో చోరీలకు పాల్పడినట్లు విచారణలో తేలిపోయినట్లు చెప్పారు. ఆశీర్వాదం ముద్దాయి పాత నేరస్తుడు, ముద్దాయిపై పెనుగొండ పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ ఉందని, 2008వ సంవత్సరం నుంచి తణుకు టౌన్, తణుకు రూరల్, ఇరగవరం, పాలకొల్లు టౌన్, రాజమండ్రి జిఆర్‌పి పోలీస్ స్టేషన్లలో సుమారు 40 కేసుల్లో అరెస్టు కాబడి అనేక సార్లు జైలుకి వెళ్లినట్లు తెలిపారు. జైలు శిక్ష అనుభవించినప్పటికీ అతని ప్రవర్తనలో ఎటువంటి మార్పు రాలేదని, గత సంవత్సరం నవంబర్ 6వ తేదీన తణుకు సబ్‌జైలు నుంచి విడుదలైనట్లు తెలిపారు. అప్పటి నుంచి తణుకు టౌన్, రూరల్ స్టేషన్ పరిధిలో నాలుగు దొంగతనాలకు పాల్పడినట్లు తెలియజేశారు. ముద్దాయిని అరెస్టు చేసిన తణుకు టౌన్ ఎస్ఐ కె.శ్రీనివాస్, అసిస్టెంట్ ఎస్ఐ బి.పోలయ్యకృష్ణ, తణుకు ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ ఎంవివి.సత్యనారాయణ, కానిస్టేబుల్స్ టి.రవి, ఎస్.కె.అక్బర్, డి.వెంగేశ్వరరావు, ఎం.శివాజీ, పి.రాంబాబులను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొండయ్య అభినందించారు.

కొట్లాటలో ఇద్దరికి గాయాలు

తణుకు రూరల్ : మహాశివరాత్రి వేడుకల్లో రెండు తరగతుల మధ్య తలెత్తిన గొడవ కారణంగా ఇద్దరు యువకులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే తణుకు మండలం తేతలి గ్రామంలో వేంచేసి ఉన్న రాజేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి సంబరం నిర్వహించారు. ఈ సంబరాల్లో తేతలి, వడ్డూరు గ్రామాలకు చెందిన యువకుల మధ్య గొడవ తలెత్తింది. అనంతరం ఆ గొడవ నేపథ్యంలో తేతలి గ్రామానికి చెందిన నరేష్, ఉండ్రాజవరం మండలం వడ్డూరు గ్రామానికి చెందిన శివ మధ్య కొట్లాటకు దారి తీసింది. దాసరి నరేష్‌తో పాటు మరికొందరు కట్ల శివపై దాడి చేయగా శివ అక్కడే ఉన్న కూల్ డ్రింక్ సీసాతో నరేష్‌పై ఎదురు దాడి చేశారు. వీరువురు గాయపడటంతో వారిని చికిత్స నిమిత్తం తణుకు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. తణుకు రూరల్ పోలీసులు వివరాలు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


వివరాలు వెల్లడిస్తున్న సిఐ రాంబాబు

గోవా మద్యం సీసాలు స్వాధీనం

నరసాపురం : మండలంలో ఎక్సైజ్ అధికారుల తనిఖీల్లో భారీ మొత్తంలో గోవా మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ ఎస్.రాంబాబు తెలిపారు. బుధవారం రాత్రి సిఐ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మండలంలోని కొప్పర్రు గ్రామంలో రావి బ్రహ్మాజీ చెందిన చెరువు వద్ద మద్యం అమ్మకాలు చేపడుతున్నట్లు సమాచారం అందించిందన్నారు. వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి నిర్వహించగా ఈ దాడిలో బ్రహ్మాజీ వెంకట జయరాజులతో పాటు దిడ్ల రామకృష్ణ, కట్లమండ జయబాబు, గొల్లమందల రాజాబాబులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి సుంకం చెల్లించని గోవా రాష్ట్రానికి చెందిన 85 కేసుల్లో ఉన్న సుమారు 4 వేల మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ జరుగుతుందని, మరిన్ని వివరాలను వెల్లడిస్తామని సిఐ తెలిపారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరిటెండెంట్ సిహెచ్.అజయ్ కుమార్ సింగ్, అసిస్టెంట్ కమిషనర్ కె.ప్రభుకుమార్ స్టేషన్‌కు చేరుకుని విచారణ చేపడుతున్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుని అరెస్ట్

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్య లక్ష్మి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, దొరబాబు, సిబ్బందితో కలిసి గణపవరం మండలం ముగ్గళ్ల గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 10 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

'పది' విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

పెనుమంచిలి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు

చిట్ చాట్

ప్రజాశక్తి - ఆచంట

మార్చిలో ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగితే మంచి ఫలితాలు సాధించవచ్చునని పెనుమంచిలి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : పెనుమంచిలి ఉన్నత పాఠశాలలో ఎంతమంది పదవ తరగతి పరీక్షలు రాస్తున్నారు?

హెచ్ఎం : పెనుమంచిలి ఉన్నత పాఠశాలలో 35 మంది విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్నారు. వీరిలో 22 మంది బాలురు, మరో 13 మంది బాలికలు ఉన్నారు.

ప్రశ్న : విద్యార్థుల భవిష్యత్తుపై మీ అభిప్రాయం?

హెచ్ఎం : ప్రతి విద్యార్థి వ్యక్తిగత క్రమశిక్షణ పాటిస్తూ జీవితానికి పూల బాట వేసుకునే తరుణం పదవ తరగతి నుంచే ప్రారంభమవుతుంది. ముఖ్యంగా తల్లిదండ్రులను గౌరవిస్తూ, ఉపాధ్యాయులను పూజిస్తూ క్రమశిక్షణతో మెలిగితే ఉన్నత శిఖరాలు చేరుకోగలుగుతారు.

ప్రశ్న : విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించేందుకు ఎటువంటి చర్యలు చేపడుతున్నారు?

హెచ్ఎం : విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించేందుకు తరచూ అవగాహనా సదస్సులు, పరీక్షల ద్వారా ఒత్తిడిని తగ్గించేందుకు కృషి చేస్తున్నాం.



ప్రశ్న : విద్యార్థుల క్రమశిక్షణపై మీ అభిప్రాయం?

హెచ్ఎం : ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలిగి తల్లిదండ్రులను గౌరవించడం నేర్చుకోవాలి. తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులకు ఆసరాగా నిలవాలి. క్రమశిక్షణ కలిగి ఉంటే ప్రతి పరీక్షలోనూ విజయం సాధించగలుగుతారు.

ప్రశ్న : విద్యార్థులకు మీరిచ్చే సలహా?

హెచ్ఎం : పదవ తరగతి జీవితాన్ని మలుచుకునే సమయం. మలుపు తిప్పే తరగతి. ఇప్పుడు కష్టపడి చదివితే భవిష్యత్ అంతా పూలబాటగా ఉంటుంది. పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో ప్రణాళికాబద్ధంగా చదువుకుని పరీక్షలకు సన్నద్ధం కావాలి. అన్ని సబ్జెక్టులకు విద్యార్థులు సమ ప్రాధాన్యత ఇవ్వాలి. ఏ ఒక్క సబ్జెక్టును అశ్రద్ధ చేయకూడదు. ఇబ్బందిగా ఉన్న సబ్జెక్టుపై పరీక్షలకు ముందుగానే అనుమానాలను నివృత్తి చేసుకొని, మంచి మార్కులు సాధించడానికి కృషిచేయాలి. పరీక్షలు దగ్గర పడేకొద్దీ ఒత్తిడి పెరుగుతుంది.

ప్రశ్న : వెనకబడిన విద్యార్థుల కోసం ఏం చర్యలు తీసుకున్నారు?

హెచ్ఎం : ప్రతిరోజు విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నాం. వీరిలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధతో పాటు వ్యక్తిగత పర్యవేక్షణలో శిక్షణ ఇస్తున్నాం. దీంతో ప్రతి విద్యార్థికి కార్పొరేట్ స్కూల్‌కు అనుగుణంగా తర్ఫీదు ఇస్తున్నాం. పరీక్షల వేల విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురికావడం సహజం. పోటీతత్వంతో పాటు తల్లిదండ్రులు ఆరా తీయడంతో ఆ ఒత్తిడి మరింత పెరుగుతుంది. పగలు, రాత్రి తేడా లేకుండా పుస్తకాలతో కుస్తీ పట్టడం మూలంగా తిండిపై ధ్యాస తగ్గిపోతుంది. ఫలితంగా విద్యార్థుల్లో నీరసం, కళ్లు తిరగడం, నిద్రలేమి ఇతరత్రా సమస్యలు తలెత్తుతాయి.

విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠాలు నేర్పిస్తూ ఎప్పటికప్పుడు చదివింది మర్చిపోకుండా తిరిగి రాయించే పద్ధతిని అమలుపరుస్తున్నాం. దీంతో మా విద్యార్థులు కఠోర దీక్షతో చదువుతూ 100 శాతం ఉత్తీర్ణత సాధించి, మా పాఠశాలకు మంచి పేరు తీసుకొస్తారని ఆశిస్తున్నాం.


ప్రజా పోరాటాల కార్యాలయాన్ని కూల్చడం దుర్మార్గం

సిపిఎం నాయకులు జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - వీరవాసరం

ఉండిలో ప్రజాపోరాటాల కార్యాలయం కూల్చడం దుర్మార్గమని సిపిఎం సీనియర్ నాయకులు జుత్తుగా నరసింహమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం గత ప్రభుత్వం ప్రజా భవనాలు, ఇతర భవనాలు కూల్చివేసిందని విమర్శించినా నేటి పాలకులు కూడా అదే తరహాలో నిత్యం ప్రజలకు సేవ చేసే కార్యాలయాలు, పేదల ఇండ్లను దుర్మార్గంగా అధికార బలం చూసుకుని కూల్చివేయడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. సిపిఎం ముఖ్య నాయకుల సమావేశం వీరవాసరం పార్టీ కార్యాలయంలో బుధవారం పోతుల మృత్యుంజయ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న నరసింహమూర్తి మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన వాగ్దానాలు అమలు చేయడంలో చూపించని శ్రద్ధ ప్రజలకు సేవ చేస్తున్న ప్రజా కార్యాలయాలు, పేదల ఇండ్లు కూల్చడంలో అగ్రభాగాన ఉండడం సిగ్గుచేటు అన్నారు. ఉండి ఎంఎల్ఎ సిపిఎం చేస్తున్న ప్రజా పోరాటాన్ని, ప్రజలకు వెన్నుదన్నుగా నిలబడటం చూసి తట్టుకోలేక ఈవిధంగా చేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 9 నెలల కాలంలో ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు అన్నారు. సూపర్ సిక్స్ మాత్రం వాయిదాల మీద వాయిదాలు వేయటాన్ని విమర్శించారు. ప్రజలకు అండగా ఉంటున్న ప్రజా పోరాటాలు చేస్తున్నందు వల్ల కక్ష కట్టి ఉండిలో సిపిఎం కార్యాలయం కూల్చి వేసినంత మాత్రాన ప్రజాపోరాటాలు ఆగవని హెచ్చరించారు. ఈ సమావేశంలో బాల విజయకుమార్, లింగం సత్యనారాయణ, తాళ్లూరు రాము, కేత జ్యోతిబసు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి పోటెత్తిన యాత్రికులు


కాళ్ల : అన్నసమారాధనలో యాత్రికులు

ప్రజాశక్తి - ఆచంట

ప్రసిద్ధిగాంచిన శ్రీరామేశ్వర స్వామి ఆలయం బుధవారం యాత్రికులతో పోటెత్తింది. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి మహాశివరాత్రికి పెద్ద ఎత్తున తరలి వచ్చి ఉత్సవాల్లో పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచి వశిష్ట గోదావరిలో పుణ్య స్థానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ దంపతులకు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వర్ధినిడి సత్యనారాయణ, ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆదిమూల వెంకట సత్యనారాయణలు స్వాగతం పలికారు. ఆలయం వద్ద స్వచ్ఛంద సంస్థలు చిన్నారులకు పాలు, వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయం సత్రంలో అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో సుమారు పదివేల మంది యాత్రికులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.


పాలకొల్లు : ఆలయంలో కలెక్టర్

సీసీ కెమెరాలు ఏర్పాటు

మహాశివరాత్రి సందర్భంగా ఆచంట పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ కె.వెంకటరమణ తెలిపారు. మొత్తం 16 చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సీసీ కెమెరాలను ఆచంట పోలీస్ స్టేషన్లో ఎప్పటికప్పుడు తమ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలతో పాటు శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు.

భీమవరం టౌన్ : మహాశివరాత్రి సందర్భంగా భీమవరం గునుపూడిలో వేంచేసియున్న సోమేశ్వర స్వామి దేవస్థానంతో పాటు భీమేశ్వర స్వామి ఆలయం, యనమదుర్రు శక్తీశ్వర స్వామివారి ఆలయాల్లో యాత్రికులు తెల్లవారుజాము మూడు గంటల నుంచి క్యూకట్టారు. దీనిలో భాగంగా సోమేశ్వరస్వామిని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు బుధవారం దర్శించుకున్నారు.

తాడేపల్లిగూడెం : మండలంలోని వీరంపాలెం బాల త్రిపుర సుందరి పంచాయతన క్షేత్రంలో బుధవారం శివరాత్రి సందర్భంగా ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు, జిల్లా కలెక్టర్ నాగరాణి, చిత్తూరు ఎంఎల్ఎ గురజాల జగన్మోహన్ విచ్చేశారు. ఆలయ పీఠాధిపతి గరిమెళ్ల వెంకటరమణ, తాడేపల్లిగూడెం తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

పాలకొల్లు : శివరాత్రి సందర్భంగా పంచారామాలలో ఒక్కటైన పాలకొల్లు క్షీర రామలింగేశ్వర స్వామిని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తల్లిదండ్రులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ బయట భక్తులకు ఏర్పాటు చేసిన పులిహోర, ప్రసాద వితరణను జిల్లా కలెక్టర్ చేతులమీదుగా భక్తులకు అందజేశారు. కలెక్టర్‌తో పాటు తహశీల్దార్ దుర్గా కిషోర్, ఆలయం ఇఒ ముచ్చర్ల శ్రీనివాస్ ఉన్నారు. క్షీర రామలింగేశ్వర స్వామిని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, చిత్తూరు ఎంఎల్ఎ గురజాల జగన్మోహన్, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, మాజీ ఎఎంసి ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు సందర్శించారు. మాజీ ఎంఎల్ఎ అల్లు వెంకట సత్యనారాయణ దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలు సేవా సంస్థలు ప్రసాదాలు, బాదం పాలు ఉచితంగా పంపిణీ చేశారు.

తణుకు రూరల్ : మండలంలోని తేతలి గ్రామంలో వేంచేసి ఉన్న రాజేశ్వర దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి శూలాల సంబరం నిర్వహించారు. గత ఏడేళ్లుగా వస్తున్న ఆచారంలో భాగంగా ఒంటికి శూలాలు గుచ్చుకుని యువకులు రథం లాగారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కోనాల గ్రామంలో వేంచేసియున్న సోమేశ్వర స్వామి ఆలయంలో, దువ్వ, పైడిపర్రు గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాళ్ల : కాళ్లకూరు గ్రామంలో వేంచేసియున్న పార్వతి సమేత భీమేశ్వరస్వామివారి దేవస్థానంలో మహాశివరాత్రి కళ్యాణ మహోత్సవాలు వైభవంగా బుధవారం నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయం వద్ద దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాట్ల వెంకట రామరాజు ఆర్థిక సహకారంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి సభ్యురాలు అడ్డాల పద్మావతి, మాజీ ఎంపిపి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు, అడ్డాల నాగరాజు, చేకూరి పుల్లంరాజు, అడ్డాల గణపతిరాజు పాల్గొన్నారు.

పెనుమంట్ర : మహా శివరాత్రి సందర్భంగా మండలంలో ప్రసిద్ధి చెందిన నత్తారామేశ్వరం ఆలయానికి బుధవారం ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. దేవాలయంలో తెల్లవారు జామునుండే శివునికి అభిషేకాలు, పూజలు జరగ్గా భక్తులు విశేషంగా పాల్గొన్నారు. మధ్యాహ్నం పన్నెండు తర్వాత వచ్చిన భక్తులను ఆపడం అధికారులకు, వాలంటీర్లుకు కష్టం అయ్యింది. పోలీసులు ద్విచక్ర వాహనాలను ఆలయం వైపు వెళ్లకుండా పెనుమంట్ర-తాడేపల్లిగూడెంలో ఉన్న ఆలయం ముఖద్వారం వద్ద ఆపకుండా వదిలేయడం వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని స్థానికులు వాపోయారు. మధ్యాహ్నం జరిగిన రథోత్సవం చూడ్డానికి పలువురు భక్తులు ఎగబడ్డారు. సాయంత్రం వేళ దాదాపు 50 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా. భక్తులకు ఉన్నంతలో రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారులు, సిబ్బంది చక్కగా ఏర్పాట్లు చేశారు. మండలం అంతటా మహా శివరాత్రి వైభవం ఉదయం నుంచి కనబడింది. మార్టేరు, నెగ్గిపూడి, ఆలమూరు, పొలమూరు, మాముడూరు, జుత్తిగ గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు.


నరసాపురం : క్యూలైన్లలో వేచియున్న యాత్రికులు


పెనుమంట్ర ఆలయంలో పోటెత్తిన యాత్రికులు

మొగల్తూరు : మండలంలోని గ్రామాలలో ఉన్న శివాలయాలు యాత్రికులతో కిటకిటలాడాయి. శివరాత్రి పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజాము నుంచి ఆలయాల వద్ద యాత్రికులు బారులు తీరారు. మొగల్తూరులోని పార్వతీ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయం, భ్రమరాంబ సమేత వనమాలికార్జున స్వామి ఆలయం, మోడీలోని భువనేశ్వరి సమేత ముక్తేశ్వర స్వామి, పేరుపాలెంలోని పార్వతీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి, కాళీపట్నంలోని కాళికాంబా సమేత కాలికేశ్వర స్వామి ఆలయం, కొత్తపాలెంలోని పార్వతీ సమేత చంద్రమౌళేశ్వర స్వామి ఆలయాలు యాత్రికులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో స్వామివారికి యాత్రికులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాల వద్ద ప్రసాదం వితరణ, తాగునీరు అందించడం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.


ఆచంటలో..

నరసాపురం : మండలంలోని లక్ష్మణేశ్వరంలోని దుర్గా లక్ష్మణేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మహాశివరాత్రి పర్వదినం వైభవంగా జరిగింది. వేకువ జామునే భక్తులు సమీపంలోని రాజులలంక వశిష్ట గోదావరిలో పుణ్య స్నానమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం పోటెత్తింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద ఆధ్వర్యంలో ఆలయం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్‌సిసి క్యాడెట్లు ఆలయం వద్ద భక్తులను క్యూలైన్లలో వచ్చేందుకు సేవలందించారు. దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో చేపట్టిన అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లక్ష్మణేశ్వరం గ్రామ పరిధిలో దారి పొడవునా శివరాత్రికి వచ్చిన భక్తులకు చలివేంద్రం, మజ్జిగ అందజేశారు. మాజీ మంత్రి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ, బొమ్మిడి సునీల్ నాయకర్, ఆలయ ఇఒ రామచంద్రకుమార్ పాల్గొన్నారు.


భీమవరం టౌన్ : ఆలయంలో శాసనమండలి ఛైర్మన్ కొయ్యేమోషేనురాజు

పాలకొల్లు : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పాలకొల్లు కొత్తపేటలో వేంచేసియున్న శ్రీభద్రకాళీ వీరభద్రస్వామి వారి మహోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలు ఆలయ అధ్యక్ష కార్యదర్శులు వట్టం గణేష్, మానెం బసవరాజుల పర్యవేక్షణలో జరిగాయి. ఆలయ ధర్మకర్తలు బాసిన గున్నేశ్వరరావు, ట్రెజరర్ బాసిన సత్యనారాయణ, వట్టం భాస్కరరావు, యర్రా శివాజీ, బాసిన రాజు, బాసిన మోహన్, బొండపల్లి చంద్రశేఖర్, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు.

బడ్జెట్‌లో పిఆర్‌సికి నిధులు కేటాయించాలి

ఎపిటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ప్రసాద్

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్ర బడ్జెట్‌లో పిఆర్‌సి బకాయిలు అమలు కోసం నిధులు కేటాయించాలని ఎపిటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు పిఎన్‌వి.ప్రసాద్ అన్నారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలని కోరారు. ఎంతో నమ్మకంతో కూటమి ప్రభుత్వానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు పూర్తిగా మద్దతు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక ఇంతవరకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఈ ప్రభుత్వం ఏమి చేయలేదని, ఈ బడ్జెట్‌లోనైనా న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కె.రాంబాబు, పివి.రాఘవులు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు పరామర్శ

ప్రజాశక్తి - పాలకోడేరు

వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహారాజు పాలకోడేరు మండలం సూర్య దినపత్రిక సీనియర్ జర్నలిస్ట్ పొన్నమండ వెంకటేశ్వరరావును పరామర్శించారు. ఇటీవల వెంకటేశ్వరరావు భార్య కమల సునీల కుమారి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న పివిఎల్ వెంకటేశ్వరావును గొరగనముడి ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. వెంకటేశ్వరరావు భార్య సునీల మృతి పట్ల నివాళులు అర్పించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పివిఎల్ వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.